

# అక్కడే ఆగక

## – మల్లాది వెంకట కృష్ణమూర్తి

**(గత సంచిక తరువాయి)**

**"చక్కగా అవుతోంది."**

"నీకు ఆ దేశం నచ్చిందా?"

"బాగా నచ్చిందమ్మా."

ఆద్య తల్లితో ఏం జరగనట్లే మామూలుగా మాట్లాడింది. కొద్దిసేపు మాట్లాడాక ఆద్య తన తండ్రితో కూడా మాట్లాడింది. ఆమె తల్లితండ్రులు ఆమె తేరుకుందన్న నమ్మకంతో ఎంతో సంతోషించారు.

ఇద్దరూ పొద్దున చేసిన ఉప్మాని వేడి చేసుకుని తింటూ కబుర్లు చెప్పుకున్నారు.

పడుకునేముందు చైత్ర తను రికార్డ్ చేసుకున్న రెండు నవలల పేర్లు తన నోట్‌బుక్‌లో రాసుకుంది. ఆద్య అక్క పుస్తకాల షెల్ఫ్‌లోని ఓ పుస్తకం కోసం వెదికి దాన్ని తీసుకుని పేజీలు తిప్పింది. ఓ పేజీలో చైత్ర అండర్‌లైన్ చేసిన వాక్యాన్ని మరోసారి చదివింది.

'ఎవరూ వెనక్కి వెళ్ళి మళ్ళీ ఆరంభించలేరు. కాని ప్రస్తుతం నించి మొదలుపెట్టి, కొత్త ముగింపుని పొందగలరు.'

'నాకు ఈ వాక్యం బాగా నచ్చింది' మనసులో అనుకుంది. మరో పుస్తకం తీసుకుని తన పడకమీదికి చేరింది.

ఆ పుస్తకం అట్టమీద ఓడలో రవాణా చేయబడే నల్ల బానిస క్లోజప్ ఫోటో ఉంది. అందులో బాధ, భయం స్పష్టంగా కనిపిస్తూ చూపరుల హృదయాన్ని ద్రవించేలా ఉంది. లోపల జాకెట్లో నల్లజాతి రచయిత్రి ఫోటోలో ఆమె ధరించిన టి షర్ట్ మీద బ్లాక్&మేడ్ బై గాడ్ అన్న పదాలు ఉన్నాయి. అప్పటికే దాన్ని చదివిన చైత్ర మార్జిన్‌లో టిక్ పెట్టిన పేరాలనే ఆద్య ఆసక్తిగా చదివింది. బానిసల గురించిన చాలా చరిత్ర ఆ పేరాల్లో ఉంది.

నాలుగు వందలేళ్ళు గడిచినా తెల్లవారినించి నల్లవారికి బాధలు తప్పలేదు. ఎన్నిటిలోనో జాతి వివక్షత ఉండేది. తెల్లవాళ్ళు ఉపయోగించే రైల్వే స్టేషన్ వెయిటింగ్ హాల్స్, రైళ్ళు, బస్‌లలోని సీట్లు, పబ్లిక్‌లో తాగే పంపులు నల్లవాళ్ళు ఉపయోగించడం నిషిద్ధం. ఓ నల్లజాతి మహిళ అమెరికాలోని తమ మీద తెల్లవారు చేసే దాష్టీకాలని ఎదిరించి చరిత్రని తిరగరాసింది.

1 డిసెంబర్ 1955 అమెరికాలోని నల్లవారికి చారిత్రాత్మక దినం. అలబామా రాష్ట్రంలోని మోంటోగొమరీలో రోజా పార్క్స్ అనే నల్లజాతి మహిళ ఆఫీస్‌నించి ఇంటికి వెళ్తూ ఎప్పటిలా సిటీ బస్‌ని ఎక్కింది. బస్ వెనకాల నల్లవారు కూర్చునే విభాగం నిండిపోవడంతో ఆమె మధ్యభాగంలోని, తెల్లవారికి కేటాయించిన విభాగం ఖాళీగా ఉంటే నల్లవాళ్ళు కూర్చోవచ్చు కాబట్టి ఓ సింగిల్ సీట్లో కూర్చుంది .మూడు స్టాప్స్ తర్వాత కొందరు తెల్లవాళ్ళు బస్ ఎక్కారు. బస్ డ్రైవర్ కూర్చున్న రోజా పార్క్స్‌ని, మరో ముగ్గురు నల్లవాళ్లని లేచి తెల్లవాళ్ళకి సీట్లు ఇవ్వమని కోరాడు. మిగిలినవాళ్ళు లేచి నిలబడ్డారు. కాని రోజా లేవనంటే, అరెస్ట్ చేయిస్తానని డ్రైవర్ బెదిరించాడు. అలాగే కానీమంది.

ఆ రాత్రి రోజా జైల్లోనే గడిపింది. మోంటోగొమరీకి చెందిన నలభైమంది పాస్టర్స్ ఈ వివక్షత తొలిగేదాకా ఆ బస్ కంపెనీకి చెందిన బస్‌లని బాయ్‌కాట్ చేయమని పిలుపుని ఇచ్చారు. వారికి లీడర్ మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్. తెల్లవారి సీట్లో కూర్చున్నందుకు రోజాకి కోర్ట్ పధ్నాలుగు డాలర్ల ఫైన్‌ని విధించింది. యు.ఎస్ సుప్రీం కోర్ట్‌లో అపీల్ చేస్తే కింది కోర్ట్ తీర్పుని రద్దుచేస్తూ కోర్ట్ అమెరికాలోని నల్లజాతివారి అన్ని వివక్షతలని కొట్టిపారేసింది. అది నల్లవారిని హీనులుగా కాక సమానులుగా చూడటానికి తోడ్పడింది.

కొంతకాలానికి అలాస్కాలోని రోజాకి లేరింగైటిస్ వచ్చి మాట పడిపోయింది. దాని గవర్నర్ జె. ఎఫ్. హేమండ్ 23 మే 1882ని రోజా పార్కర్ డేగా ప్రకటిస్తూ ఆమెతో చెప్పాడు.

"రోజా! మీరు మాట్లాడక్కర్లేదు. మీ జీవితమే మాట్లాడింది."

తమ ఆఫ్రికన్ సంగీతం, నృత్యం, మతపర సెర్మనీలని బానిసలు వదల్లేదు. దాంట్లోంచి హైబ్రిడ్ సంస్కృతి కూడా ఉద్భవించింది.

పుస్తకం పూర్తిచేసాక అది తను చదివిన మొదటి నాన్-ఫిక్షన్ పుస్తకం అని ఆద్యకి స్ఫురించింది. మనిషి ఎందుకు నాన్-ఫిక్షన్ పుస్తకం చదువుతాడో కూడా అర్ధమైంది. తెలుసుకోవాలనే దాహంతో. అది ఉండాలి.

ఆ రాత్రి ఆద్య మనసులో ప్రేమ వైఫల్యం బాధ తాలూకు సాంద్రత చాలావరకు తగ్గింది. ఆఫ్రికన్స్‌లో ఆత్మహత్య చేసుకోవాల్సిన కష్టాలు అప్పట్లో ఉన్నా వారు వాటిని ధీరోదాత్తంగా ఎదుర్కొన్నారు. వారి కష్టాలతో పోలిస్తే తనది అసలు కష్టమేకాదు. బాధే కాదు. లోకంలో చాలామందికి జరిగే ఓ చిన్న నిరాశ మాత్రమే.

ఆ రాత్రి సంజీవ కుటుంబంలోని వారంతా ఆనందంగా నిద్రపోయారు.

## 19

ఎప్పటిలా మర్నాడు ఉదయం ఆద్య నిద్రలేచేసరికి అనస్థీషియా పాటలు పాడుకుంటూ పనిచేస్తోంది. అద్యని చూసి నవ్వుతూ పలకరించింది. ఆమె ప్రతీరోజూ టవల్స్, మంచాలమీది దుప్పట్లని మార్చి వాటిని ఉతికి ఇస్త్రీ చేస్తుందని ఆద్య గమనించింది.

ఆద్య కాలకృత్యాలు తీర్చుకుని మెట్లు దిగి కిందకి వచ్చి ఇంటి వెనకే ఉన్న స్విమ్మింగ్ పూల్‌కి స్విమ్మింగ్ ప్రాక్టీస్‌కి వెళ్ళింది. ఇరవై నిమిషాల తర్వాత మళ్ళీ ఇంటికి వచ్చి స్నానం చేసింది. 'పీనట్ బటర్‌ని పూసి, అరటిపండు ముక్కలతో సేండ్‌విచ్ చేసుకో. అదే ఈరోజు నీ బ్రేక్‌ఫాస్ట్' అని రాసుంది.

ఆ సేండ్‌విచ్ ఆద్యకి నచ్చింది. తింటూ టి.వి ఆన్ చేసి 'జస్ట్ ఫర్ లాఫ్స్' చూసాక, క్రితం రోజు చూసిన టైముకి బి.బి.సి ఛానల్‌కి మారుస్తూంటే ఓ సౌతాఫ్రికన్ క్రిస్టియన్ ఛానల్లోని కోర్ట్ రూం డ్రామా ఆమెని ఆకట్టుకోవడంతో దాన్నే ఉంచి చూసింది.

సౌతాఫ్రికాలోని ఓ కోర్ట్ హాల్‌లో ఓ క్రిమినల్ కేస్ విచారణని డ్రామాగా చూపిస్తున్నారు. డెబ్బై ఏళ్ళు పైబడ్డ ఓ బలహీనమైన నల్లజాతి వృద్ధురాలు సందర్శకుల వరసలో కూర్చుని ఉంది. వేన్ డెర్ బ్రోయెక్ అనే పోలీస్ ఆఫీసర్ మీద విచారణ పూర్తైంది. ఆ ఆఫీసర్ ఆ వృద్ధురాలి కొడుకుని, తర్వాత ఆవిడ భర్తని బలవంతంగా తీసుకెళ్ళి హత్యచేసాడని ఋజువైంది.

ఈ కేస్‌లో ఆ పోలీస్ ఆఫీసర్ మొదటి నేరం వాళ్ళింటికి పోలీసులతో వచ్చి, ఆవిడ భర్తని, కొడుకుని తీసుకెళ్ళడం. ఎన్ని రోజులు గడిచినా ఆవిడకి తన భర్త, కొడుకుల గురించిన సమాచారం తెలీలేదు. కొన్నిరోజుల తర్వాత వేన్ డెర్ బ్రోయెక్ మళ్ళీ ఆవిడ ఇంటికి వచ్చి ఆవిడని ఓ నది ఒడ్డుకి తీసుకెళ్ళాడు. చేతులు వెనక్కి కట్టబడ్డ ఆవిడ భర్త చితిమీద కనిపించాడు. తమ కొడుకుని తన ఎదుటే పాయింట్ బ్లేంక్ రేంజ్‌లో కాల్చి చంపి అతని శవాన్ని పూడ్చేసాడని ఆయన తన భార్యకి చెప్పాడు. ఆయన్ని బాగా కొట్టిన గుర్తులు శరీరం మీద కనిపించాయి. బ్రోయెక్, అతని సహచరులు ఆయన ఒంటిమీద కిరోసిన్ పోసి అంటిస్తూంటే ఆయన నోట్లోంచి, 'తండ్రీ! వారిని క్షమించు' అన్న మాటలు వచ్చాయి.

సౌతాఫ్రికన్ ట్రూత్ అండ్ రికన్సిలియేషన్ కమిషన్ సభ్యుడు ఆవిడని అడిగాడు.

"ఇప్పుడు మీకేం కావాలి? మీ కుటుంబాన్ని పశుత్వంతో నాశనం చేసిన ఇతని విషయంలో న్యాయం ఎలా జరగాలని మీరు కోరుకుంటున్నారు?"

ఆవిడ లేచి శాంతంగా ఇలా చెప్పింది. "ఇతన్నించి నాకు మూడు కావాలి. మొదటిది నా భర్తని తగలపెట్టిన చోటికి తీసుకెళ్ళడం. అది నాకు గుర్తు లేదు. అక్కడి మట్టిని సేకరించి దాన్ని క్రిస్టియన్ మతాచారం ప్రకారం పాతిపెడతాను. రెండోది, వేన్ డెర్ బ్రోయెక్ నా కొడుకుని దూరం చేసినందుకు నాకు కొడుకై, నెలకి రెండుసార్లు ఘెట్టోలోని నా ఇంటికి వచ్చి ఆ రోజంతా నా కొడుకుగా గడపాలి. నాలో ఉన్న నా కొడుకు మీది ప్రేమని నేను అతనిమీద కురిపిస్తాను. మూడవది నేను బ్రోయెక్‌ని క్షమించాను. నా క్షమాపణని అతను అంగీకరించాలి. ఇది నా భర్త కోరిక. న్యాయదేవత ముందు, అందరి ముందు ఇక్కడ నేను వేన్ డెర్ బ్రోయెక్‌ని ఆలింగనం చేసుకుని అతన్ని క్షమించానని చెప్పడానికి అతను అనుమతించాలి. యు షల్ నాట్ టేక్ వెంజెన్స్: లెవిటికస్ నైన్టీన్ ఈస్టూ ఎయిటీన్."

ఆవిడ చెప్పేది ముగియగానే కొన్ని క్షణాలు కోర్ట్ హాల్‌లో గుండుసూది వినబడేంత నిశ్శబ్దం అలుముకుంది .తీవ్రభావనా సంచలనంతో హంతకుడు వేన్ డెర్ బ్రోయెక్‌కి స్పృహ తప్పింది .అతను తేరుకున్నాక ఆవిడని కోర్ట్ క్లర్క్ అతని దగ్గరకి తీసుకెళ్ళాడు. ఆవిడ అతన్ని ప్రేమగా ఆలింగనం చేసుకోగానే, బ్రోయెక్ కళ్ళవెంట జలజలా నీళ్ళు కారాయి. ఇతర బాధిత నల్లజాతి కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రుల్ ఉనెమ్మదిగా ఓ క్రిస్టియన్ పాటని పాడారు.

ఎమేజింగ్ గ్రేస్! హౌ స్వీట్ ఏ సౌండ్ దట్ సేవ్డ్ ఏ రెచ్ లైక్ మి

డోంట్ జడ్జ్ బై అపీరెన్సెస్. ఏ రిజ్ హార్ట్ మే బి అండర్ ఏ పూర్ కోట్.

క్షమాపణ అంత తీవ్ర అనుకూలభావాన్ని కలిగిస్తుందని అనుభవంలోలేని ఆద్య కళ్ళల్లోంచి నీళ్ళు కారసాగాయి. అంతలో 'ఛ! నేనెందుకు ఏడవడం?' అనుకుని కన్నీళ్ళు తుడుచుకుంది. మళ్ళీ వాయిస్ ఓవర్లో ఈ మాటలు వినిపించాయి.

"అరటి పండుని తొక్క తీసి తింటాం. సపోటాని గింజలని తొలగించి తింటాం. మామిడిపండులోని టెంకని తీసి తింటాం. సీతాఫలంలోని తొక్కని, గింజలని తొలగించి గుజ్జుని మాత్రమే తింటాం. జామ, ఏపిల్ పళ్ళని మొత్తం తింటాం. ఇలా మనం ఓ పండులోని తొక్కని, మరో పండులోని గింజలని, ఇంకో పండులోని టెంకని, ఇంకో పండులోని తొక్కని, గింజలని తొలగించి తింటాం. పళ్ళని తింటున్నప్పుడు అందులోని తినదగ్గ మంచి భాగమే మనకి గుర్తుంటుంది తప్ప, చెడు భాగం గుర్తుండదు. అక్కరలేనిది పారేసి కావాల్సిందే తింటాం.

"మనుషులు కూడా పళ్ళలాంటి వారే. మన జీవితంలోని అమ్మానాన్నలు, అక్కచెల్లెళ్ళు, అన్నదమ్ములు, భార్యాభర్తలు, బంధువులు, మిత్రులు మొదలైనవారంతా ఒకోరకం పండులాంటి వారు. ఒకొక్కరిదీ ఒకో స్వభావం. పళ్ళల్లోలా వారందరిలో మనకి మంచి చేసే గుణం ఉంటుంది. మనకి పండులోని మంచి గుర్తుంటుంది తప్ప చెడు గుర్తుండనట్లుగా, వారిలోని ప్రేమ, ఆప్యాయత, సహాయం చేసే గుణంలాంటివి తప్ప వారిలోని కోపం, ద్వేషం, ఈర్ష్య, స్వార్ధంలాంటి చెడు భాగాలని విస్మరించాలి. ఇవన్నీ కలిస్తేనే మనిషి అని గుర్తించి, అక్కర్లేనిది మర్చిపోయి, వారిలోని చెడుని ద్వేషించకుండా మంచిని మాత్రమే స్వీకరించాలి. ఇదే క్రిస్టియన్ మతం బోధించే క్షమ."

తర్వాత క్రిస్టియన్ పాటల కార్యక్రమం కాబట్టి టి.విని ఆఫ్ చేసింది. ఆమెకి జినేంద్రని తను క్షమించిందా అన్న ప్రశ్న ఉత్పన్నమైంది. ఫోన్‌లో యూ ట్యూబ్‌లో తెలుగు పాటలు వినాలనుకుంది. కాని ఇంటర్నెట్ స్లోగా ఉంది కాబట్టి వినలేకపోయింది.

కొద్దిసేపటికి చర్చ్‌లోంచి పాటలు వినిపించడంతో కాలక్షేపానికి అక్కడికి వెళ్ళింది. ఎప్పటిలా గుమ్మం దగ్గర సూట్‌లోని ఘనా మనిషి ఆమెకి స్వాగతం పలికి 'జీసస్ లవ్స్ యు' అని చెప్పాడు. మునుపటి పాస్టరే మాట్లాడుతున్నాడు.

"బురుండి రాజధాని గిటేగాలో నిన్న అగ్ని ప్రమాదం జరిగింది. ఏడుగురు మరణించారు. వారందరూ జీసస్ దగ్గరకి చేరాలని ప్రార్ధిద్దాం."

ఆయనతో సహా అంతా తలలు వంచి, కళ్ళు మూసుకుని నిశ్శబ్దంగా ప్రార్ధించడాన్ని ఆద్య గమనించింది.

"నిన్న బంగ్లాదేశ్‌లోని తుఫానుకి వేలమంది నిరాశ్రయులయ్యారు. వందలమంది మరణించారు. వారి ఆత్మశాంతికోసం కూడా ప్రార్ధిద్దాం."

మళ్ళీ అంతా తలలు వంచి, కళ్ళు మూసుకుని నిశ్శబ్దంగా ప్రార్ధించారు. ఈసారి ఆద్యకూడా నిజాయితీగా ప్రార్ధించింది. అలా మరికొందరి కోసం ప్రార్ధించాక ఆయన కొనసాగించాడు.

"ప్రేమ అనేది మనిషికున్న శక్తివంతమైన భావాల్లో ఒకటి. అది అగ్నిలాంటిది. మీ హృదయానికి వెచ్చదనాన్ని ఇవ్వచ్చు. లేదా మీ ఇంటినే కాల్చచ్చు. ప్రేమ ఆనందాన్నివ్వచ్చు. తీవ్ర విషాదాన్ని కూడా ఇవ్వచ్చు. పిచ్చి పనులు కూడా చేయించచ్చు.

పదిహేడో శతాబ్దంలో ఆలివర్ క్రామ్వెల్ కారణం విచారించమని సైనికులని పంపాడు. వారు కొద్దిసేపటికి రక్తసిక్తమైన ఓ స్త్రీని ప్రవేశపెట్టి చెప్పారు.'ఈమె గంట నాలికని కౌగలించుకుని ఉండటంతో గంట మోగలేదు.'

'ఎవరు నువ్వు? ఎందుకీ పనిచేసావు?' క్రామ్వెల్ కోపంగా ప్రశ్నించాడు.

'నా భర్త మరనశిక్షని చూడలేక. అతనికన్నా నేనే ముందు మరణించి, అతని ప్రాణాలని మరికొద్దిసేపు కాపాడాలని' ఆమె నిర్లిప్తంగా చెప్పింది.

రక్తం కారే ఆమె చేతులని, కాళ్ళని, వీపుని చూసిన ఆయన మనసు కరిగింది.

'సరే. ఈ రోజు కర్ఫ్యూ బెల్ మోగదు. కాబట్టి నీ భర్త శిక్ష రద్దైంది' ఆయన చెప్పాడు. క్రైస్ట్ మనకోసం సరిగ్గా ఇదే త్యాగం చేసాడు. మనకోసం రక్తతర్పణాన్ని ఇచ్చాడు."

ఆద్య ఆ తర్వాత ఫాదర్ చెప్పేదాని మీద మనసు పెట్టలేకపోయింది. ప్రవచనం వినలేదు. ఆ భార్య ప్రేమ గురించి ఆలోచించింది.

తనకి జినేంద్రమీద అంతటి ప్రేమ ఉందా? తను అతనికోసం తన ప్రాణాలని అంత బాధాకరంగా సమర్పించగలదా? నో అనే స్థిరమైన జవాబు వచ్చింది. తను ప్రేమించడం అనే వయసిచ్చే బలమైన హక్కుని వినియోగించుకోడానికి అతన్ని ఎన్నుకుందా? తనని ఒకరు ప్రేమిస్తున్నారన్న ఆనందం తను అతనివల్ల అనుభవించింది. ప్రేమించడం లేదన్నది అర్ధమవగానే ఆ ఆనందం మాయమై విషాదాన్ని అనుభవించింది. విషాదాన్నా? లేక అవమానాన్నా? ఆ రెంటి కలయికని అనుభవించింది. తనలోని మానసిక లోపాన్ని అర్ధం చేసుకున్నాక ఆద్య కొంత రిలీఫ్‌ని ఫీలైంది.

సాయంత్రం మూడున్నరకి చైత్ర బుక్ చేసుకున్న ఆఫీస్ కార్ వచ్చింది.

"థాంక్స్ సైమన్" డ్రైవర్‌కి ఆద్య చెప్పింది.

తయారుగా ఉన్న చైత్ర, ఆద్య ఆ కారులో షుమారు పది కిలోమీటర్ల దూరంలోని గార్డెన్ మార్ట్ అనే షాప్‌కి వెళ్ళారు. దారిలో అనేక షాపుల పేర్లని చూసి వారికి జీసస్ మీద గల భక్తికి ఆద్య ఆశ్చర్యపోయింది.'గాడ్ డిడిట్ ఆల్' ఫేషన్ సెంటర్, 'గాడ్ విల్ ప్రొవైడ్' సూపర్ మార్కెట్, 'గాడ్ ఫస్ట్' కార్ వాష్, 'గాడ్ బ్లెస్ యు' మోడ్రన్ ఫేషన్స్, 'ఎక్సెప్ట్ గాడ్' బిల్డింగ్ ..గార్డెన్ మార్ట్‌లోకి వెళ్ళబోయేముందు దాని ఎదురుగా ఉన్న బేంక్ ఏటిఎంలో చైత్ర డెబిట్ కార్డ్‌ని ఉపయోగించి ఐదువందల సిడిలని డ్రా చేసింది. వస్తూ రోడ్ పక్కన బుట్టలో పెట్టి అమ్మే ఆద్యకి తెలీని ఓ రెండు వైలెట్ రంగు పళ్ళని తెచ్చింది.

"అవేమిటక్కా?" ఆద్య చేతిలోకి తీసుకుని నొక్కి చూసి అడిగింది.

"ఆవకాడో. ప్రపంచంలోని ప్రొటీన్ గల ఏకైక పండు ఇది. ఒకదాంతో సలాడ్ చేస్తాను. రెండోది పచ్చడి చేస్తాను. పద. ఇది మా టకరోడీలోని డౌన్‌టౌన్. ఇది మా స్పెన్సర్ సూపర్ బజార్. ఇదే మా వాల్‌మార్ట్. ఇక్కడికి ఫ్రోజెన్ ఈటబుల్స్ వచ్చీరాగానే ఆ కబురు ఎక్స్‌పేక్స్‌లో కార్చిచ్చులా వ్యాపించి, అంతా పోటీపడి వెంటనే వచ్చి కొనుక్కుని వెళ్తారు. ఇవి ఇక్కడ తప్ప టకరోడీలో మరెక్కడా దొరకవు. నీకేమైనా కావాలేమో చూసుకో" చైత్ర మెట్లెక్కి పైకెళ్తూ నవ్వుతూ చెప్పింది.

అందులోవన్నీ విదేశాలనించి దిగుమతి చేసుకున్నవే. ఎక్కువగా డీప్ ఫ్రీజ్ ఫుడ్ ఐటమ్స్. బటర్, ఛీజ్, బ్రెడ్, చాక్లెట్స్, బిస్కెట్స్, మాంసం మొదలైనవి. కండెన్స్‌డ్ మిల్క్‌ని తీసుకుంది. ష్రింప్ కేన్స్‌ని చూడగానే ఉత్సాహంగా బుట్టలో వేసుకుని చెప్పింది.

"దీంతో చేసే పచ్చడి చాలా బావుంటుంది."

"చూడు డాలీ! నువ్వు లక్కీ. ఇక్కడున్నంతకాలం ఇంక పెరుగన్నం తినచ్చు" డేనన్ యోగర్ట్ కప్‌ని చూసి చైత్ర ఆనందంగా చెప్పింది.

చైత్ర ఓ పొడుగాటి కాడున్న గులాబీని, రెండు చాక్లెట్ బాస్కెట్‌లని కొన్నది. ఆ గులాబీని చూడగనే ఆద్య మొహం విషాదంగా మారింది.

“పన్నెండు గులాబుల గుత్తిని కట్టమని చెప్పాను. కాని పదమూడు సంఖ్య మంచిది కాదని పదకొండు గులాబులనే కట్టమన్నాను” జినేంద్ర తనని మొదటిరోజు చైనీస్ రెస్ట్‌రెంట్లో కలిసినప్పుడు ఆ గుత్తిని ఇచ్చి చెప్పాడు.

"పదమూడా? అంటే?"

"నీ చేతిలో పన్నెండు గులాబులు ఉండి నువ్వు అద్దంలోకి చూస్తూంటే నీకు పదమూడో గులాబి కనిపిస్తుంది" కన్నుగీటి చెప్పాడు.

ఇదివరకు తనకి ఇలాంటివి గుర్తు రాగానే ఏడిచేది. ఇప్పుడా తీవ్రత తనలో తగ్గిందని ఆద్య గ్రహించింది. ఆలోచనలని ఆపి షాపంతా తిరిగి చూసింది. కాని ఆమెకేమీ అవసరమైనవి కనపడలేదు. కాఫీ ప్రియురాలైన చైత్ర కెనడానించి దిగుమతైన టిమ్ హార్టన్స్ కాఫీ సీసాని, కొలంబియన్ కాఫీ రీఫిల్ పేక్‌ని, వైన్ సీసాలని, కొన్ని రకాల ఛీజ్‌లని, వీట్ ఆకోకో ఆర్గానిక్ బ్రాండ్ కోకోనట్ వాటర్ నీలం రంగు కార్టన్‌ని బుట్టలో వేసుకుని చెప్పింది.

"ఇది థాయ్‌లేండ్ నించి వచ్చింది. కొబ్బరి నీళ్ళు చాలా తాజాగా ఉంటాయి. ఓపెన్ చేసాక ఫ్రిజ్‌లో పెట్టి నాలుగైదు రోజుల్లో తాగెయ్యాలి."

కారులో అలెక్సీ ఇంటికి బయలుదేరారు. చైత్ర దారిలో చెప్పింది.

"అలెక్సీ జోక్స్ బాగా వేస్తాడు. అందుకే అతన్ని అంతా ఇష్టపడతారు. మన భాషరానివాళ్ళతో ఉన్నప్పుడు మనిద్దరం కూడా ఇంగ్లీష్‌లోనే మాట్లాడుకోవాలి. తెలుగులో మాట్లాడుకోవడం అమర్యాద."

వారి ఇంటి బయట బోర్డ్‌ని చూసి ఆద్య ఫక్కున నవ్వింది.

'ఫర్గెట్ ది డాగ్. బివేర్ ఆఫ్ ది చిల్డ్రన్ '

వారి కారాగిన చప్పుడు విన్న ఇలియా తలుపు తెరచి వారిద్దర్నీ సాదరంగా ఆహ్వానించింది. అ రష్యన్స్ ఇంట్లోని గోడకున్న సైన్ బోర్డ్ ఆద్యని ఆకర్షించింది.

'డిలీట్ ఎవ్విరిథింగ్ ఇన్ యువర్ మైండ్ దట్స్ నాట్ మూవింగ్ యు ఫార్వార్డ్ '

ఆద్య దాన్ని ఆసక్తిగా చదవడం గమనించిన ఇలియా నవ్వుతూ చెప్పింది.

"అలెక్సీ రిగ్స్ మిదకి వెళ్ళి తిరిగి వచ్చేదాకా నా గుండె బితుకు బితుకుమంటూంటుంది. రెండు మూడుసార్లు రిగ్స్ అంటుకుని అక్కడివారంతా మరణించారు. దాంతో మానసిక క్షోభనిచ్చే చెడు ఆలోచనలు నన్ను తరిమేవి. అవి మానమని మందలిస్తూ మా నాన్నగారు దీన్ని నాకు ప్రజంట్ చేసారు."

"సముద్రమధ్యలో రిగ్స్ లో ఎంతమందుంటారు? నీకు కాలక్షేపం ఏమిటి?" ఆద్య అలెక్సీని అడిగింది.

"నూట ఏభైమందిదాకా ఉంటాం. సదా ఎనభైమంది డ్యూటీలో ఉంటాం. కాలక్షేపమా? తొమ్మిది బై ఆరు అడుగుల బల్లమీది పద్దెనిమిది వేల పీసెస్‌గల పజిల్స్‌ని కలపడం. ఆఖరి పీస్‌ని కలిపాక బయల్దేరే సమయం వస్తుంది" అలెక్సీ చెప్పాడు.

వాళ్ళిల్లు తమ ఇంటికన్నా ఇంకాస్త విశాలంగా ఉందని ఆద్య గమనించింది.

చైత్ర పిల్లలు ఇద్దరికీ చెరో రస్సెల్ స్టోవర్ చాక్లెట్ బాక్స్‌ని ఇచ్చింది.

"ఏం చెప్పాలి?" అలెక్సీ అడిగాడు.

"థాంక్స్ చైత్రా" ఇద్దరూ చెప్పారు.

ఆద్య వారికి బీఫ్, పోర్క్‌కేన్స్, డజను ఇంజెరా (ఇథోపియన్ దోశ) పాకెట్, ఛీజ్‌లని ఇచ్చింది.

"ఏం చెప్పాలి?" అలెక్సీ భార్యని అడిగాడు.

అంతా ఫక్కున నవ్వారు.

"థాంక్స్ ఏ లాట్. విమానం వచ్చిందా? ఫుడ్ ఐటెమ్స్ వచ్చాయా?" అవి కేవలం గార్డెన్ మార్ట్ లోనే దొరుకుతాయని తెలిసిన ఇలియా వెంటనే అడిగింది.

"ఊహూ. వస్తే ముందుగా తెలిసేది నీకే. ఖాలెద్ ఎప్పుడు వస్తున్నాడో సమాచారం ఏదైనా తెలిసిందా?" చైత్ర అడిగింది.

"రాలేదు. బ్లడ్ ఈజ్ థిక్కర్ దేన్ వాటర్ కదా" అలెక్సీ నిస్పృహగా చెప్పాడు.

ఓ కుక్క ఫోటోని చూసి ఆద్య అడిగింది

"దాని పేరు?"

వెంటనే ఇలియా కంఠం బాధగా మారింది.

"బెంజీ. మా పిల్లలు దాన్నింకా మిస్సవుతున్నారు. మాకు కాంగోలోని పాయింట్ నార్‌నించి బదిలీ అయి ఇక్కడికి వచ్చేప్పుడు ఈ దేశంలోకి తీసుకురానివ్వరని తెలిసి, బెంజీని ఎవరికైనా ఇవ్వాలని ప్రయత్నించాం. కాని ఎవరూ తీసుకోడానికి దొరకలేదు. చేసేదిలేక దాన్ని వదిలి ఇక్కడికి వచ్చాం. అది మా కారు వెనక పరిగెత్తుకు వచ్చింది. తర్వాత తెలిసింది. బెంజీ విమానాశ్రయానికి వచ్చి మేం వెళ్ళిన గేట్ దగ్గరే మాకోసం ఎదురుచూస్తూ అక్కడే మరణించిందని. ఆ తర్వాత మళ్ళీ కుక్కని పెంచదలచుకోలేదు."

"మనుషులందరికీ అప్లై అయ్యేది ఒకటి చెప్పనా? కష్టాన్ని మర్చిపోవడం ఎంతో కష్టం. అదే సమయంలో సుఖాన్ని గుర్తుంచుకోవడం కూడా అంతే కష్టం. కష్టాలు వదిలినట్లుగా సుఖాలు మనసులో మచ్చల్ని వదలవు. అది మాకెంతో ఆనందాన్నిచ్చింది. కాని బాధనే గుర్తుంచుకుంటున్నాం" అలెక్సీ ఆ కుక్క ఫోటోని చేత్తో తడుముతూ చెప్పాడు.

"బయట నువ్వు చూసిన బోర్డ్‌ని దాని గుర్తుగా అలెక్సీ తెచ్చాడు" చైత్ర చెప్పింది.

"కమాన్, లెట్స్ ఈట్" ఇలియానా ఆహ్వానించింది.

అంతా డైనింగ్ టేబుల్ ముందు కూర్చున్నారు. ఆద్య బల్లమీది సాల్ట్ అండ్ పెప్పర్ షేకర్లని చూసింది. ఉప్పుది తెలుపు. పెప్పర్‌ది నలుపు. ఆ రెండూ మనుషుల ఆకారంలో ఉండి, అందులోవి బయటకి రావడానికి ముఖంలోని కళ్ళు, నోరుండాల్సిన చోటలో మూడు రంధ్రాలున్నాయి. ఆ రెండూ చేతులు చాపి ఒకదాన్నొకటి కౌగలించుకున్నట్లుగా నిలబెట్టబడి ఉన్నాయి .వాటి వీపులమీద 'హాయ్, ఐ యాం సాల్ట్, హాయ్, ఐ యాం పెప్పర్' అని ఎర్ర రంగులో, కేమన్ ఐలండ్ అని కింద ఆకుపచ్చ రంగులో ఉన్నాయి. వాటిని అక్కడ కొన్నారని ఆద్య గ్రహించింది.

"రష్యా గురించి నీకేం తెలుసు?" అలెక్సీ ఆద్యని అడిగాడు.

"చాలా చలిదేశమని తెలుసు. రష్యన్ వింటర్స్ దుర్భరమని విన్నాను."

"ప్రపంచంలో బేడ్ వెదర్ అంటూ ఉండదు. సరైన దుస్తులు వేసుకోకపోవడమే ఉంటుంది. వింటర్లో మా లెనిన్ గ్రాడ్‌లో కార్లమీద, రోడ్లమీద, చెట్లమీద కురిసిన మంచుని చూసినపుడు దేవుడు ప్రపంచాన్ని గిఫ్ట్ రాప్ చేసాడు అనిపిస్తుంది. రష్యన్ ఓడ్కా కూడా ప్రసిద్ధి" ఇలియా చెప్పింది.

"బ్లీనీకి కూడా. అంటే పేన్‌కేక్స్‌కి రష్యా ప్రసిద్ధి" అలెక్సీ చెప్పాడు.

"బై ది వే, మావారో గొప్ప రచయిత. అతి పొట్టి కథలు చాలా రాసారు .రెండే వాక్యాల కథలని. దురదృష్టవశాత్తు నోబెల్ ప్రైజ్ వారి దృష్టిలో పడలేదు. కదా ఆల్?" ఇలియా భర్త బుగ్గమీద చుంబించి నవ్వుతూ అడిగింది.

"ఓ! మాకు కొన్ని వినిపిస్తారా?" ఆద్య ఉత్సాహంగా అడిగింది.

"ఆద్యకి కవిత్వం అంటే ఇష్టం" చైత్ర చెప్పింది.

"అది మంచి సలహా డాలీ" చైత్ర వెంటనే చెల్లెలివంక చూస్తూ చెప్పింది.

"వాళ్ళు నీ ఫిలాసఫీకోసం కాదు. నీ కథలకోసం వేచి చూస్తున్నారు మిత్రమా!" ఇలియానా నవ్వుతూ భర్తని హెచ్చరించింది.

"స్కూల్లో చదివిన కుక్క కూడా కవిత్వం చెప్పగలదని మాకో సామెత ఉంది. ఈ రెండు వాక్యాల కథల్లో మొదటి వాక్యానికి రెండో వాక్యంతో సంబంధం ఉంటుంది. ఈ రెండు వాక్యాల మధ్య భాగాన్ని పెద్ద కథతో నింపచ్చు. ఈ రెంటి మధ్యా జరిగింది ఊహిస్తే ఆశ్చర్యాన్ని, నవ్వుని, ఆనందాన్ని, బాధని, సస్పెన్స్‌ని ఇలా మనసుని వివిధ రకాలుగా స్పందింపచేస్తాయి. కొన్ని హృదయాన్ని కదిలిస్తాయి. కొన్ని గోప్యంగా, కొన్ని ఆలోచించేవిగా, కొన్ని హాస్యంగా, కొన్ని సీరియస్‌గా కొన్ని ఏదో ఓ భావోద్వేగాన్ని రేకెత్తించేవిగ ఉంటాయి. లెట్ మీ సీ.." అతను ఆలోచించుకుని రెంటిమధ్యా ఆలోచించుకోడానికి కొన్ని క్షణాల వ్యవధిని ఇస్తూ చెప్పసాగాడు.

"ప్రపంచంలోని ఆఖరి వ్యక్తి బల్లముందు భోజనానికి కూర్చున్నాడు.

"అతనికి తలుపు తట్టిన చప్పుడు వినిపించింది."

"హారర్ స్టోరీ రాయచ్చు" ఆద్య వెంటనే చెప్పింది.

"అతను ఆ ఉదయం బేంక్‌లోని ఎకౌంట్స్‌లోంచి డబ్బుని తీసుకున్నాడు.

అవన్నీ ఇతరుల ఎకౌంట్స్‌కి చెందినవి."

"క్రైం కథ" చైత్ర నవ్వింది.

"ఓ తల్లి నవ్వే రోజది

ఆమె బిడ్డ తొలిసారిగా ఏడ్చే రోజది."

"వండ్రఫుల్ ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఏ బర్త్" చైత్ర చెప్పింది.

"నా మేనత్త నా గదిలోకి రావడం చూసి నేను భయపడినట్లుగా ఎన్నడూ భయపడలేదు. ఆవిడ మూడు నెలల క్రితం మరణించింది."

"మరో హారర్ స్టోరీ" ఆద్య చెప్పింది.

"మా బాబాయ్ పాతికేళ్ళకే మరణించాడు. కాని ఆయన డెబ్బై ఏడో ఏటే చితికి చేరాడు."

"అర్థమైంది" ఆద్య నవ్వుతూ చెప్పింది.

"పంతొమ్మిదేళ్ళ యువకుడు డ్రగ్స్‌ని తేలిగ్గా కనుక్కోగలడు. ముప్పై ఏళ్ళ అనుభవంగల పోలీస్ కనుక్కోలేడు."

"అమెరికన్ సీన్" చైత్ర చెప్పింది.

"తమ్ముడికి డౌన్స్ సిండ్రోముతో కూతురు పుట్టిందని తెలిసిన అన్న, 'అయ్యో! దాన్ని అనాధశరణాలయానికి ఇవ్వు ' అని సలహా ఇచ్చాడు. 'అది నీకు కాక నాకు పుట్టినందుకు సంతోషంగా ఉంది ' తమ్ముడు చెప్పాడు."

"టచీ" ఆద్య చెప్పింది.

"తన భార్యని చంపి ఊరు చివర్లో పాతాడు. పోలీసులు వెదుకుతూంటే పాతిన చోటులోంచి గుండె కొట్టుకునే చప్పుడు గట్టిగా వినిపించసాగింది."

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి
www.anandbooks.com
www.telugubooks.in

Post your comments